
కష్టపడే కార్యకర్తకు గుర్తింపు

మద్దిరాల, న్యూస్‌టుడే: పార్టీ కొరకు కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మహిళ జిల్లా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని చందుపట్లలో తుంగతుర్తి నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు పచ్చిపాల సుమతీ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వాలను నమోదు చేసి మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో యువత పదేళ్లు వెనక్కిపోయి కుటుంబ అవసరాలకు చాలీచాలని జీతాలతో బతుకు బండిని లాగుతున్నారని దుయ్యబట్టారు. మండల కిసాన్‌సెల్ అధ్యక్షుడు వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి పచ్చిపాల వెంకన్న, గ్రామాధ్యక్షుడు తీకుళ్ల సుధాకర్‌రెడ్డి, కొమ్ము వెంకన్న, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

భక్తజన బాంధవుడికి ఆరాధనలు



శ్రీ లక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సుప్రభాతంతో మొదలైన నిత్యారాధనలు రాత్రి జరిపిన శయనోత్సవం కైంకర్యంతో తెర పడింది. మధ్యాహ్నం వరకు దైవదర్శనానికి భక్తులు బారులు తీరారు. పూజారులు మూలవరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీసుదర్శన హోమం, నిత్యకల్యాణం, సర్వపుష్పారాధన, అలంకార సేవోత్సవాలను ఆలయ ఆచారంగా కొనసాగించారు. గర్భాలయంలో కొలువై ఉన్న స్వయంభువులను మహిమల మండపంలో దూరం నుంచే స్మరిస్తూ, భక్తులు భక్తితో దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీలక్ష్మీనరసింహస్వామి అలంకార సేవోత్సవాన్ని వేద మంత్రాల మధ్య నిర్వహించారు. రాత్రి వేళ ఆరాధన సహస్రనామార్చన నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో శ్రీలక్ష్మీనరసింహస్వామిని కొలుస్తూ నిజాభిషేకం, తులసీ అర్చన, నిత్యకల్యాణం జరిపారు.

నేత్రపర్వంగా మహా కుంభాభిషేకం



కలశాలతో వెళుతున్న మహిళలు



విజయదుర్గ ఆలయంలో మహాకుంభాభిషేక పూజలు

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: నేరేడుచర్ల విజయదుర్గ ఆలయం నిర్మించి పన్నెండు సంవత్సరాలు(పుష్కర కాలం) కావడంతో ఆదివారం కుంభాభిషేక కార్యక్రమాన్ని ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల నడుమ కనులపండువగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు కలశాలు నెత్తిన పెట్టుకుని నేరేడుచర్ల పట్టణ ప్రధాన కూడలి నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయం వద్ద పూజా కార్యక్రమాల అనంతరం గర్భగుడి శిఖరంపై నుంచి వేదపండితులు కుంభాభిషేకం జరిపారు.

ఉండ్రుగొండ అభివృద్ధికి మరిన్ని నిధులు: పటేల్ రమేష్‌రెడ్డి



గిరిదుర్గంలో పటేల్ రమేష్‌రెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు, అభివృద్ధి కమిటీ సభ్యులు

చివ్వెంల, న్యూస్‌టుడే: మండలంలోని ఉండ్రుగొండ గిరిదుర్గాన్ని పర్యాటకులకు కనువిందు చేసేలా, తెలంగాణలోనే అత్యంత ప్రాముఖ్యం కలిగిన ప్రదేశంగా అభివృద్ధి చేసి తీరుతామని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఉండ్రుగొండ గిరిదుర్గాన్ని ఆదివారం ఆయన సందర్శించి మాట్లాడారు. గత పాలకుల పరిపాలనలో ఇన్నాళ్లు ఈ ప్రాంతం నిరాదరణకు గురైందని, ఇక్కడ ఎన్నో చారిత్రక కట్టడాలు, చరిత్రను కనుమరుగు చేసేందుకు కొందరు ప్రయత్నించారని పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన ఉండ్రుగొండ అభివృద్ధికి రూ.2.50 కోట్లు మంజూరు చేశామని, దశల వారీగా నిధులు సమకూరి మరిన్ని నిధులు మంజూరు చేయిస్తామన్నారు. ఇక్కడ నిర్మించే పనులపై ప్రణాళికలు వేయాల్సిందిగా అధికారులకు సూచించారు. త్వరలోనే పనులకు శ్రీకారం చుడతామని ఆయన హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ ఆదుర్తి రామయ్య, బంధకవి కృష్ణమోహన్, మురళీకృష్ణ, ఎలగబోయిన శ్రీరాములు తదితరులున్నారు.

కమిటీ కనుసన్నల్లో కొనుగోళ్లు

- రెండు రకాల ధాన్యం కేంద్రాల ఏర్పాటుకు కార్యాచరణ
- పర్యవేక్షణ బృందాలతో నిత్యం తనిఖీ



ఆత్మకూర్(ఎస్) కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం (పాతచిత్రం)

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: సన్నరకం వరి సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించింది. ఈ బోనస్‌ను 2024-25 వానాకాలం నుంచే అమలు చేసేందుకు సర్కారు సిద్ధమైంది. అందులో భాగంగా సన్నాలు, దొడ్డురకం ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేర్వేరు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేలా కార్యాచరణ రూపొందించారు. ఆయా కేంద్రాల్లో కొనుగోళ్ల పరంగా ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించేలా మండల స్థాయిలో కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఇందులో తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్సై, ఏఈవోలు, ఐకేపీ ఏపీఎంలు, పీఏసీఎస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్, సీఈవో, మెప్మా అధికారులు సభ్యులుగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ఈ కమిటీలకు సంబంధించి జిల్లా కేంద్రాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు.

సన్నరకాల గుర్తింపు ఇలా..

◆ సన్న ధాన్యంపై అనుమానం ఉంటే కేంద్రానికి కేటాయించిన మైక్రోమీటర్ ద్వారా రైతు, ఏఈవో, కేంద్ర నిర్వాహకుల సమక్షంలో ధాన్యం గింజను కొలుస్తారు.

◆ ధాన్యం పొట్టు తీసి పొడవు, వెడల్పు నిష్పత్తి లెక్కిస్తే 3 కన్నా తక్కువ ఉంటే దొడ్డురకం, ఎక్కువ ఉంటే సన్నరకం ధాన్యంగా గుర్తిస్తారు.

◆ వడ్లను మిల్లులకు తరలించే క్రమంలోనూ గన్నీ సంచులపై సన్నరకం అయితే "ఎస్", దొడ్డు రకం అయితే "డీ" అని గుర్తులు పెడతారు.

పచ్చిధాన్యం తేకుండా అవగాహన

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పీఏసీఎస్, ఐకేపీ, మెప్మా ఆధ్వర్యంలో 871 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వీటికి తేమ కొలిచే, ధాన్యం శుద్ధి చేసే యంత్రాలు, గన్నీ సంచులతోపాటు ఈ సారి అదనంగా టార్పాలిన్లు (పట్టాలు), సన్నరకం ధాన్యాన్ని కొలిచే మైక్రోమీటర్లను కేటాయించనున్నారు. ధాన్యం రాశుల బట్టి అదనంగా కేంద్రాలు పెంచే వెసులుబాటు కల్పించారు. అవసరం ఉన్న చోట కమిటీ సభ్యుల నిర్ణయం మేరకు జిల్లా స్థాయి అధికారులకు తెలిపి మరికొన్ని కేంద్రాలు ఏర్పాటుచేస్తారు. ఈసారి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో నగదు జమ చేసేలా కసరత్తు చేస్తున్నారు. సమస్యలపై రైతులు ఫిర్యాదు చేసుకునేలా ఆయా కలెక్టరేట్లలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయనున్నారు. కేంద్రాలను నిత్యం ఆకస్మికంగా తనిఖీ చేసేలా జిల్లాస్థాయి అధికారులతో పర్యవేక్షణ బృందాలను నియమించనున్నారు. పచ్చిగా ఉన్న పంటను కోయకుండా వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వరి సాగు వివరాలు (ఎకరాల్లో..)

	నల్గొండ	సూర్యాపేట	యాదాద్రి
సన్నాలు	2,68,778	93,188	31,961
దొడ్డు	2,41,404	3,79,746	2,27,537
మొత్తం	5,10,182	4,72,934	2,59,498

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు, ధాన్యం రాక అంచనా (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	కేంద్రాలు	సన్నాలు	దొడ్డు	మొత్తం
నల్గొండ	375	2,80,000	4,70,000	7,50,000
సూర్యాపేట	206	1,71,197	1,99,029	3,70,226
యాదాద్రి	290	32,363	4,00,000	4,32,363

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు

–అప్పారావు, డీఆర్డీవో, సూర్యాపేట

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టనున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లుచేస్తున్నాం. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సన్నాల కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉన్నాం. మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి వారి నేతృత్వంలో అక్రమాలకు తావులేకుండా కొనుగోళ్లు నిర్వహించనున్నాం.

జగన్మాత.. శరణు శరణు



సూర్యాపేట సాంస్కృతికం: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో వైభవంగా కొనసాగుతున్నాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆయా ఆలయాల్లో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా పూజలను నిర్వహిస్తున్నారు. నాల్గో రోజు శ్రీలలితాత్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఆయా వాడల్లో నెలకొల్పిన మండపాల వద్ద భక్తులు పూలతో అమ్మవారిని అలంకరించి కొలిచారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు.



కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: భవానీనగర్‌లోని వినాయకుడి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపుతున్నారు. ఆదివారం మండపం వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. నయానగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గాదేవిని నాలుగో రోజు లలితాత్రిపుర సుందరీదేవి రూపంలో అలంకరించి పంచామృతాలతో అభిషేకాలు చేశారు.

అంతర్జాలం.. అందనంత దూరం

- డిజిటల్ పాఠాలకు తప్పని ఇబ్బందులు



తరగతి గదిలో డిజిటల్ పాఠాల బోధిస్తున్న ఉపాధ్యాయుడు

గరిడేపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం మహోన్నత లక్ష్యంతో ప్రవేశపెట్టిన డిజిటల్ బోధనకు అవాంతరాలు తప్పడం లేదు. పథకం ప్రవేశపెట్టి రెండేళ్లవుతున్నా నేటికీ పాఠశాలలకు ఇంటర్‌నెట్(అంతర్జాలం) సౌకర్యం కల్పించలేదు. ఫలితంగా అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. మరి కొన్ని చోట్ల ఉపాధ్యాయులే తమ సెల్‌ఫోన్‌లోని హాట్‌స్పాట్ ద్వారా డేటా అందిస్తూ పాఠాలు బోధిస్తున్నారు.

సమస్య ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు పాఠశాలలకు దీటుగా విద్యనందించేందుకు 2022-23 విద్యాసంవత్సరంలో డిజిటల్ పాఠాలను ప్రవేశపెట్టారు. విద్యార్థులకు డిజిటల్ బోర్డుపై వీడియోలు చూపిస్తూ బోధించడం ద్వారా వారిలో జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ఇలా బోధన చేపట్టాలని నిర్ణయించినా పూర్తిస్థాయిలో అమలుకాలేదు. 2023 మార్చిలో కొన్ని పాఠశాలలకు డిజిటల్ బోర్డులు(ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్-ఐఎఫ్‌పీ) మంజూరుచేసింది. అప్పటికే విద్యాసంవత్సరం పూర్తవుతుండటంతో కొన్నిచోట్ల వాటిని నామమాత్రంగా ఉపయోగించారు. మరి కొన్ని చోట్ల భద్రపరిచి 2023-24 విద్యాసంవత్సరం ఆరంభంలో ఏర్పాటుచేశారు. అదే విద్యా సంవత్సరంలో అన్ని ఉన్నత పాఠశాలలకు బీఎస్ఎన్ఎల్ కేబుల్ ద్వారా ఇంటర్‌నెట్ కల్పిస్తామని చెప్పారు. నేటికీ కల్పించలేదు. కొందరు ఉపాధ్యాయులు హాట్‌స్పాట్ ఉపయోగిస్తున్నా నెట్‌వర్క్ సిగ్నల్ లేకుంటే పాఠాలు మధ్యలోనే ఆగిపోతున్నాయి.

జిల్లా	ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల సంఖ్య	మంజూరైన ఐఎఫ్‌పీలు
సూర్యాపేట	210	644
నల్గొండ	289	875
యాదాద్రి	183	538

రక్షణ లేక అవస్థలు

ఒక్కొక్కటి సుమారు రూ.3.50 లక్షల నుంచి రూ.5.50 లక్షల విలువ చేసే ప్యానల్స్‌ను పాఠశాలల్లో భద్ర పరచడమంటే ప్రధానోపాధ్యాయులకు కత్తిమీద సాములాంటిదే. అనేక పాఠశాలలు ఊరికి దూరంగా ఉండటంతో వాటికి రక్షణ లేకుండా పోతోంది. గతంలో వేసవి వచ్చిందంటే పాఠశాలల్లో కంప్యూటర్స్‌తోపాటు ఇతర సామగ్రి చోరీకి గురయ్యేవి. ఇపుడు ఇంత విలువైన ప్యానల్స్‌ను జాగ్రత్తగా ఉంచడం కష్టంగానే ఉందని ప్రధానోపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులు కాపలాదారును నియమించారు. తర్వాత ఊసే లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌తో పాటు రక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉంది.

ప్రమాదం జరగక ముందే పట్టించుకోరూ..!



కోదాడ, న్యూస్‌టుడే: కోదాడలో గత నెలలో వచ్చిన వరదలకు నియోజకవర్గంలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. కోదాడ పట్టణ పరిధిలో తమ్మర వద్ద ఖమ్మం వెళ్లే జాతీయ రహదారి.. తారు రోడ్డు వరకు మట్టి కొట్టుకుపోయి కోతకు గురైంది. దీంతో ఆ ప్రాంతమంతా ప్రమాదకరంగా మారింది. వాహనాల టైర్లు జారితే లోయలో పడి వాహనదారుల ప్రాణాలు పోయే ప్రమాదముంది. వరదలొచ్చి నెల దాటినా నేటికీ అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించకపోవడం ఏంటనీ వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరిగి ప్రాణాలు పోకముందే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

★ యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయిస్తామని ఎన్‌హెచ్ఏఐ పీడీ దివ్య తెలిపారు. వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు.

వార్డుల్లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు: ఆర్డీఆర్



సూర్యాపేట: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: సూర్యాపేటలోని 48 వార్డుల్లో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామని మాజీ మంత్రి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన వార్డు ఇన్‌ఛార్జి, ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వాళ్లకు ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. రాజకీయ, వ్యక్తిగత సమస్యలు ఉన్నా ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. త్వరలో వారానికి మూడు రోజులు ఉదయం, రెండు రోజులు సాయంత్రం వార్డుల్లో తిరుగుతూ సమస్యలు తెలుసుకుంటానని, వెంటనే అక్కడికక్కడే పరిష్కారం చేయిస్తానని, వార్డుల్లో హెల్ప్‌డెస్క్ ఏర్పాట్లు చేస్తానని తెలిపారు. ఆరు పథకాలకూ డిజిటల్ కార్డు ఉపయోగపడుతుందన్నారు. గృహ జ్యోతి దరఖాస్తుకు వెళ్లే మహిళలను అధికారులు ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వ పాలనలో వార్డు అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరిగాయని, వాటిని వెలికితీస్తానన్నారు. ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, రాష్ట్ర సీనియర్ నాయకులు కొప్పుల వేణారెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు, అంజద్ అలీ, శ్రీనివాస్, పద్మ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు యువకుడి మృతి



సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: పిడుగుపాటుతో యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని సోలిపేటలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోలిపేట గ్రామానికి చెందిన తీగల పరమేశ్(28) గొర్రెలు కాసేందుకు వెళ్లాడు. ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో చెట్టుకింద నిలబడ్డారు. ఒక్కసారిగా పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందారు.

ట్రాక్టర్ అదుపు తప్పి ఒకరి దుర్మరణం

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: ట్రాక్టరు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకుపోవడంతో డ్రైవర్ మృతిచెందిన ఘటన ఆత్మకూర్(ఎస్) మండలంలోని నెమ్మికల్ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోరింగ్‌తండాకు చెందిన గుగులోతు మల్సూరు(30) ఆదివారం సాయంత్రం ట్రాక్టరులో పత్తికూలీలను తీసుకొని వెళ్లి దుబ్బతండాలో దించి తిరిగి వస్తున్నాడు. నెమ్మికల్ రెవెన్యూ శివారులో సూర్యాపేట-దంతాలపల్లి రహదారిపై రైసు మిల్లు వద్దకు చేరుకోగానే ట్రాక్టరు అదుపు తప్పి రోడ్డుపక్కకు దూసుకుపోయింది. ప్రమాదంలో రహదారిపై ఎగిరిపడ్డ మల్సూరుకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రున్ని సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య అనిత, ఏడేళ్లు, ఐదేళ్ల వయసున్న ఇద్దరు కుమారులున్నారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్సై వై.సైదులు తెలిపారు.

ధర పెంచేసి.. రూ.లక్షలు కాజేసి

- ★ వైటీపీఎస్ కేంద్రంగా కమీషన్ దందా
- ★ ఓ ప్రజాప్రతినిధి హస్తంపై ఆరోపణలు





ఈనాడు, నల్గొండ: అదీ.. ఉమ్మడి జిల్లా సరిహద్దులో ఉన్న ఓ నియోజకవర్గం. సున్నపురాయి నిక్షేపాలున్న ప్రాంతం. సర్కారు చేపడుతున్న నిర్మాణాలకు రోజూ రెండు వేల టన్నుల కంకర తరలుతోంది. ఇక్కడే అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి అక్రమానికి తెరలేపారు. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే టన్ను కంకర లోడుకు రూ.200 వరకు పెంచి కమీషన్ దండుకుంటున్నాడు. ఈ లెక్కన నిత్యం రూ.నాలుగు లక్షల వరకు కమీషన్ రూపంలోనే ఆర్జిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణ వ్యయం పెరిగి ప్రజాధనం దుర్వినియోగమవుతున్నా.. అధికార వర్గాలు మాత్రం 'చూసీ'చూడనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం.

గతంలో తరలింపు ఇలా..

యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం (వైటీపీఎస్) నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం నెలకొంటుండటంతో జిల్లా మంత్రులు ప్రత్యేక దృష్టిసారించి నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు. దీంతో ఉన్నతాధికారులు ఇటీవలే పనుల్లో వేగం పెంచారు. ఇప్పటికే ఇక్కడ రెండు యూనిట్లు పూర్తికాగా.. త్వరలోనే మరో రెండింటినీ పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వైటీపీఎస్‌లో జరిగే నిర్మాణ పనులకు నిత్యం 1500 టన్నుల నుంచి రెండు వేల టన్నులకు పైగా కంకర కావాల్సి ఉంటుంది. నిర్మాణాలు, రహదారులు, ఇతరత్రా పనులకు స్థానికంగా మరో 500 టన్నుల అవసరం ఉంటుంది. ఈ పనులకు గత నాలుగైదు నెలల వరకు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల క్రషర్‌లతో పాటు హైదరాబాద్ నుంచి కంకర వచ్చేది. టన్నుకు రూ.550 నుంచి రూ.600 వరకు అధికారులు కొనుగోలు చేసేవారు.

చక్రం తిప్పారిలా..

కొన్ని నెలలుగా హైదరాబాద్‌తో పాటు స్థానికంగా ఉన్న పలు క్రషర్ల నుంచి వస్తున్న కంకరను వైటీపీఎస్‌కు సరఫరా చేయొద్దని సదరు ప్రజాప్రతినిధి హుకూం జారీ చేశారు. పక్క నియోజకవర్గంలో ఉన్న మరో పార్టీకి చెందిన ఓ భారీ మిల్లు నుంచి కమీషన్ తీసుకొని అక్కడి నుంచే ప్లాంటుకు కంకర తరలిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఈ దందాతో వైటీపీఎస్ నిర్మాణం వ్యయం పెరిగి ప్రభుత్వంపై భారం పడుతుంది. మరోవైపు సదరు నియోజకవర్గ కేంద్రంతో పాటు చుట్టుపక్కల ఉన్న చిన్న చిన్న క్రషర్లను సైతం మూసివేయించి సామాన్యుల అవసరాలకూ ఆ మిల్లు నుంచే కంకర వచ్చేలా చేస్తున్నారని అక్కడి బిల్డర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలల కాలంలో సుమారు ఆరు క్రషర్లు మూత పడటం విశేషం. "నాలుగైదు నెలల వరకు టన్నుకు రూ.550 చొప్పున కొనుగోలు చేశాం. మేం తరచూ కొనుగోలు చేసే క్రషర్‌ను అధికారుల వేధింపులతో దాని యజమాని మూసేశారు. హైదరాబాద్ సమీపంలో నుంచి వచ్చే కంకర సైతం ఇదే ధరతో కొనుగోలు చేశాం. అక్కడి నుంచి రావొద్దని చెప్పారట. ఇప్పుడు రూ.780 నుంచి రూ.800 వరకు కొనుగోలు చేస్తున్నాం. అయినా గతంతో పోలిస్తే నాణ్యతగా ఉండటం లేద"ని బిల్డర్స్ అసోసియేషన్ సభ్యుడొకరు 'ఈనాడు'కు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు స్పందించి నాణ్యమైన కంకరను తక్కువ ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గతం కంటే ఎక్కువ ధరకు కంకర కొంటున్న విషయమై వైటీపీఎస్ సీఈ సమ్మయ్యను 'ఈనాడు' సంప్రదించగా.. ఇసుక, కంకరకు తాము ఒకేసారి కాంట్రాక్టు ఇస్తామని, దీన్ని నిత్యం భెల్ అధికారులు, గుత్తేదారు పర్యవేక్షణ చేస్తారని, ఎంత ధరకు కొంటున్నారో తనకు తెలియ'ని వెల్లడించారు.

కంకర తేలి.. అధ్వానంగా మారి



సూర్యాపేటలోని శ్రీరాంనగర్-బాలాజీనగర్ రోడ్డు కంకర తేలింది అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షానికి భారీగా వరద ప్రవహించడంతో రహదారి దెబ్బతింది. వాహనదారులు, కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రహదారిని సీసీగా మార్చకపోవడంతో వర్షాలు కురిసినప్పుడు కాలనీవాసులు నరకయాతన పడుతున్నారు. వాహనాల రాకపోకలకు చిన్న చిన్న కంకర ఎగిరిపడుతున్నా పట్టించుకునే వారు కరవు. రాత్రి సమయంలో పాదచారులు కంకరను గమనించక కిందపడుతున్నారు. 'మరమ్మతు చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూస్తామ'ని పుర కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు.
– సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే

గొంతులో ఇరుక్కుపోతున్నాయ్ జాగ్రత్త..!



మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

చిన్నారులు ఆడుకుంటూ.. తమ చేతిలో ఉన్న వస్తువులను నోట్లో పెట్టుకోవడం సర్వసాధారణం. ఒక్కోసారి ఆ వస్తువులను పొరపాటున మింగడంతో గొంతు, ఆహార నాళాల్లో ఇరుక్కుపోయి.. ఊపిరాడక మరణించిన ఘటనలు సైతం చోటుచేసుకున్నాయి. గొంతులో ఆహార పదార్థాలు ఇరుక్కున్నప్పుడు సరైన అవగాహన లేకపోవడంతో పలువురు సమస్యను జటిలం చేసుకుంటున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా సుమారు 30 మందికి పైగా గొంతు, నాళాల్లో పదార్థాలు, వస్తువులు ఇరుక్కుని ఆసుపత్రిలో చేరుతున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- చిన్నారులకు గొంతులో ఇరుక్కునే పరిమాణంలో ఉండే నాణేలు, వస్తువులు ఇవ్వకూడదు.
- ఆహార నాళాల్లో అల్సర్లకు దారి తీసే అయస్కాంతం, బ్యాటరీలు, పిన్నీసులు వంటి పదునైన వస్తువులను పిల్లలకు అందుబాటులో ఉంచరాదు.
- మాంసాహారంతోపాటు గట్టిగా ఉండే పదార్థాలను మెత్తగా నమలాలి.
- క్యారెట్ వంటి ఆహార పదార్థాలను తురిమి చిన్నారులకు అందించాలి.
- పిల్లల మెడలో సన్నటి గొలుసులు, నెక్లెస్‌లు వేయకూడదు.
- చిన్నారులు ఆడుకోవడానికి నాణేలు, కాసులు ఇవ్వొద్దు.
- చిన్నారుల గొంతులో ఏదైనా ఇరుక్కుపోతే పొట్టపై రుద్దకూడదు. పొట్ట లోపల గాయాలు కావొచ్చు.
- గొంతులో ఏదైనా ఇరుక్కుపోయినట్లు అనిపిస్తే తలపై తట్టకూడదు.
- గట్టిగా దగ్గడం వల్ల గొంతులో ఇరుక్కున్న వస్తువులు బయటపడే అవకాశం ఉంది.

బలవంతంగా తీయొద్దు



– డాక్టర్ మువ్వ శ్రీహర్ష, గ్యాస్ట్రో ఇంటస్టైనల్ సర్జన్, మిర్యాలగూడ

పిల్లలు, పెద్దల గొంతు, ఆహార నాళాల్లో ఏదైనా ఇరుక్కుపోయిందని గమనించిన వెంటనే బలవంతంగా తీసేందుకు ప్రయత్నించకుండా తక్షణమే వైద్యుడిని సంప్రదించాలి. సూక్ష్మ పరికరాలను ఉపయోగించి.. వస్తువు స్థితిని గమనించి.. జాగ్రత్తగా బయటకు తీయడమా.. పొట్టలోకి నెట్టడమా చేస్తాం. గత నెలలోనే నలుగురికి ఆధునిక చికిత్స ద్వారా ఇరుక్కుపోయిన వస్తువులను బయటకు తీశాం.


సంఘటనలు ఇలా..

- రెండేళ్ల క్రితం సూర్యాపేట జిల్లా రాజానాయక్ తండాలో ఓ వ్యక్తి మేక మాంసం ఎముక గొంతులో ఇరుక్కుని ప్రాణాలు కోల్పోయారు.
- యాదాద్రి భువనగిరి జిల్లా కక్కిరేణి గ్రామానికి చెందిన వృద్ధుడికి దంతాలు లేక నమలకుండానే మాంసం ముక్క మింగారు. వైద్యులు అతి కష్టం మీద శస్త్రచికిత్స చేసి తీసేశారు.
- గుర్రంపోడుకు చెందిన ఓ మహిళ నాటు మందు మింగారు. అది గొంతులో అడ్డుపడగా.. నీరు తాగడంతో మరింత ఉబ్బిపోయింది. మందుముద్దను వైద్యులు ఎండోస్కోపీ ద్వారా ముక్కలుగా చేసి పొట్టలోకి తోశారు.



- పెద్దవూర మండలానికి చెందిన నాలుగేళ్ల బాలుడు గత నెలలో రెండు రూపాయల నాణేన్ని మింగడంతో మిర్యాలగూడలో ఆధునిక చికిత్స విధానంతో బయటకు తీశారు.

మొదలైన దసరా రద్దీ



జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి వస్తూ బారులు తీరిన వాహనాలు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్‌కు అప్పుడే దసరా పండుగ కళ వచ్చింది. ఆదివారం రోజున స్థానిక వస్త్రాలు, గాజులు, చెప్పులు, అలంకరణ వస్తువులు విక్రయించే దుకాణాలు జనంతో కిక్కిరిశాయి. సంత కూడా ఇదే రోజున నిర్వహిస్తుండడంతో ఎక్కడ చూసినా కొనుగోళ్లు చేస్తున్న జనమే కనిపించారు. పాఠశాలలు, కళాశాలల కు సెలవులు ప్రకటించడంతో హైదరాబాద్‌లో నివాసముండే ఈ ప్రాంతవాసులు కుటుంబాలతో సొంతూళ్లకు కార్లలో ప్రయాణం కావడంతో జాతీయ రహదారిపై రద్దీ ఏర్పడింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ, ప్రైవేటు ట్రావెల్స్ సంస్థలు ప్రత్యేక బస్సులు నడుపుతుండడంతో వాహనాలు బారులు తీరాయి. దీనికి తోడు సరుకులు రవాణా చేసే వాహనాలు, ఆటోలు తదితర వాహనాలు రోడ్డుపైకి రావడంతో రద్దీ పెరిగింది. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ రద్దీతో సమస్యలు ఏర్పడకుండా క్రమబద్ధీకరించారు. ఇదే రద్దీ దసరా పండగ వరకు కొనసాగే అవకాశముంది.

మృత్యువులా దూసుకొచ్చిన లారీ: ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు

యాచారం, న్యూస్‌టుడే: కొద్ది నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సిన వ్యక్తిని లారీ రూపంలో వచ్చిన మృత్యువు కబళించింది. ఈ రోడ్డు ప్రమాద సంఘటన రంగారెడ్డి జిల్లా మాల్ గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. ఒకరు మృతి చెందగా ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా వెంకటేశ్వర నగర్ నివాసి గున్నాల భాస్కర్(45) వారాంతపు సంతల్లో చిల్లర వ్యాపారులకు హోల్‌సేల్‌గా కూరగాయలు సరఫరా చేస్తాడు. నల్గొండ గట్టుప్పల్‌లో శనివారం నిర్వహించిన సంతలో కూరగాయలు సరఫరా చేసి ఆటోలో ఇంటికి తిరిగి వస్తున్నాడు. మాల్ వద్ద ఎదురుగా వచ్చిన లారీ.. ఆటో ఢీకొట్టడంతో భాస్కర్ అక్కడికక్కడే మృతిచెందాడు. అతనితో వస్తున్న అతని చెల్లెలు జయమ్మ, అక్క వెంకటమ్మ, ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. మరో ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సిన వీరంతా రోడ్డు ప్రమాదం పాలయ్యారు. భాస్కర్‌కు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు, భార్య ఉన్నారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు యాచారం సీఐ శంకర్‌కుమార్ చెప్పారు.

వీవీఐపీల విడిదికి కొండపైనే విల్లాలు



యాదాద్రిలో ప్రెసిడెన్షియల్ సూట్ల సముదాయం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పంచనారసింహ పుణ్యక్షేత్రంలో వీవీఐపీలు బస చేసేందుకు వారికి అనుగుణంగా ప్రత్యేక ప్రాంగణంలో విల్లాలు నిర్మించిన విషయం తెలిసిందే. ఈ క్షేత్రాభివృద్ధిలో భాగంగా దాతల ఆర్థిక సహకారంతో ప్రెసిడెన్షియల్ సూట్ల పేరిట 14 విల్లాలు, ప్రెసిడెన్షియల్ సూట్ నిర్మించారు. వీటికి అయిన వ్యయం రూ.104 కోట్లు దాతలు సమకూర్చినవే. యాదాద్రి కొండకింది ఉత్తర దిశలో పదమూడు ఎకరాల కొండపైన విడిది విల్లాలు ఏర్పాటయ్యాయి. భద్రత కట్టుదిట్టం కోసం రక్షణ గోడ నిర్మించారు. 14 విల్లాలో మొత్తం 70 సూట్లు ఉన్నాయి. ఒక్కో విల్లాలో ఐదు సూట్లు ఐదు కుటుంబాలు బస చేసేలా అవసరమైన వసతులతో వీటిని వైటీడీఏ పర్యవేక్షణలో అద్దె కిస్తారు. ఒక రోజుకు ఒక్క సూట్ అద్దె రూ.3 వేలు.

కన్నవారి కలలు ఫలించె.. కొలువు పల్లెవించె..!



నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే:

తల్లిదండ్రులు రోజువారి వ్యవసాయ కూలీలు. తాము పడుతున్న కష్టాలు పిల్లలు పడొద్దని భావించి ఉన్నత చదువులు చదివించారు. నిరంతరం శ్రమించి, వారి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసిన కన్నవారి ఆశయాలను గుర్తించి నెరవేర్చారు నూతనకల్ మండలంలోని పలు పల్లెల యువత. నిర్దిష్ట లక్ష్యం, ప్రణాళిక, వారికి ఇష్టమైన రంగాల్లో స్థిరపడాలన్న కోరికతో చదివి ఉద్యోగాలు సాధించారు. ఇటీవల వెలువడిన పలు ప్రభుత్వ ఉద్యోగ ఫలితాల్లో మండలంలోని యువతీయువకులు కొలువులు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు.

కోర్టు ఉద్యోగం మానేసి.. – గంట వెంకటేశ్, దిర్శన్‌పల్లి



అమ్మానాన్నలు గంట సాలయ్య-వెంకటమ్మ. రోజువారి కూలీ పనులు చేస్తూ ఎంతో కష్టపడి నన్ను చదివించారు. ఎంఏ బీఈడీ పూర్తి చేసి గ్రూప్స్‌కి తర్ఫీదు పొందా. ఇటీవల తుంగతుర్తి న్యాయస్థానంలో క్లరికల్ ఉద్యోగం సాధించా. అది మానేసి హాస్టల్ వెల్ఫేర్ కొలువుకు సన్నద్ధమై రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించా.

అమ్మానాన్న కళ్లల్లో ఆనందం చూశా.. – తన్నీరు ఉమేష్, యడవెల్లి



విద్యుత్తు శాఖలో హెల్పర్‌గా(రోజువారి కూలీ) పనిచేస్తున్న నాన్న కష్టం చూసి.. లక్ష్యాన్ని నిర్దేశించుకొని కృషి చేశా. అగ్రికల్చర్ ఇంజినీరింగ్ పూర్తయిన అనంతరం గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమయ్యా. తర్వాత ఏఈఈగా ఉద్యోగం.. నెక్కొండలో పోస్టు వచ్చింది. అమ్మానాన్నల కళ్లల్లో ఆనందం చూశా.

పేదరికాన్ని జయించా



– రచ్చ సందీప్, చిల్పకుంట్ల

తల్లిదండ్రులు జీవనోపాధి కోసం సూరత్ వెళ్లి.. కరోనా సమయంలో స్వగ్రామానికి వచ్చారు. చేనేత కార్మికులుగా పని చేస్తూ అమ్మానాన్నలు రచ్చ వెంకటేశ్వర్లు-నిర్మల నన్ను చదివించారు. పేదరికం నుంచి బయటపడాలని కసితో చదివి విజయం సాధించా. నీటిపారుదల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్(ఏఈఈ) ఉద్యోగం సాధించి మహబూబాబాద్‌లో విధుల్లో చేరా.

సొంత జిల్లాలో కొలువు

– నామాల భవాని, చిల్పకుంట్ల



వ్యవసాయ కళాశాలలో చేరి ఇంజినీరింగ్ చేస్తున్నప్పుడే ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ప్రణాళికలు వేసుకొని లక్ష్య సాధనకు కృషి చేశా. అమ్మానాన్నల ప్రోత్సాహంతో ముందుకు సాగాను. ఏఈఈ ఉద్యోగం సాధించి ఇటీవల సూర్యాపేట జిల్లా కేంద్రంలో విధుల్లో చేరా. సొంత జిల్లాలో పనిచేస్తున్నందుకు ఆనందంగా ఉంది.

తల్లిదండ్రుల కల నెరవేర్చా

– రాచమల్ల శ్రావణి, పెదనెమిల



అమ్మానాన్నలు రాచమల్ల శ్రీనివాస్, లక్ష్మీలకు ముగ్గురు ఆడపిల్లలం. నాకు రెండేళ్ల కిందట వివాహమైంది. 'పెద్ద కుమార్తెవు.. విజయం సాధిస్తే చెల్లెల్లకు ఆదర్శంగా నిలుస్తావు' అన్న అమ్మానాన్నల మాటలు.. భర్త ప్రోత్సాహంతో ముందుకు సాగాను. ఏఈఈ కొలువు సాధించి సొంత మండలంలోనే విధుల్లో చేరా. తల్లిదండ్రుల కల నెరవేర్చినందుకు సంతోషంగా ఉంది.

భూమిపై పెట్టుబడితో భరోసా: ఎమ్మెల్యే



చింతపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, చిత్రంలో సినీ నటులు శ్రీకాంత్, తరుణ్

చింతపల్లి, న్యూస్‌టుడే: భూమి మీద పెట్టుబడి పెడితే భవిష్యత్తులో భరోసా కలుగుతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. చింతపల్లి మండల కేంద్ర సమీపంలో స్థిరాస్తి రంగం సంస్థలైన శ్రీమిత్ర, ఆరు ఆధ్వర్యంలో సాయి సన్నిధి వెంచర్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ హీరోలు శ్రీకాంత్, తరుణ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్-నాగార్జునసాగర్ రహదారిని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. చింతపల్లి సమీపంలోని కుర్మేడ్ నుంచి ఆర్‌ఆర్‌ఆర్ పోతుందని, సమీపంలో వైజాగ్ కాలనీ ఉండటంతో పర్యాటకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వెంచర్లు ఏర్పాటు చేసి వినియోగదారులకు విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు. సాయిబాబా దేవాలయం సమీపంలో వెంచర్ ఏర్పాటు చేసి మధ్య తరగతి వారికి ప్లాట్లను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని సినీ హీరోలు శ్రీకాంత్, తరుణ్ అన్నారు. కార్యక్రమంలో శ్రీమిత్ర ఛైర్మన్ ఎం.వీ.చౌదరి, తేజ నివాస్, తేజగోవింద్, ఆరు నిర్వాహకులు రవితేజ అఖిల్, సికేందర్, శైలేందర్, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, ఉజ్జిని యాదగిరిరావు, సాయిబాబా దేవాలయ ఛైర్మన్ మంచికంటి ధనుంజయ, దొంతం సంజీవ రెడ్డి, అంగిరేకుల నాగభూషణం, ముచ్చర్ల యాదగిరి, నటుడు ఖయ్యూం, తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో సాగితే విజయం ఖాయం

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: పట్టుదలతో, శిక్షకుల సహకారంతో ముందుకు సాగితే విజయాలు ఖాయమని మెదక్ పురపాలిక అధ్యక్షుడు చంద్రపాల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం మెదక్‌లోని ఇందిరాగాంధీ మైదానంలో పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-17 బాలికల రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా పది ఉమ్మడి జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. మూడు రోజుల పాటు 24 మ్యాచ్‌లు జరుగుతాయని, ప్రతిభ చూపిన వారు రాష్ట్రస్థాయి జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

★ మెదక్ జట్టు నిజామాబాద్, హైదరాబాద్ జట్లతో రెండు మ్యాచ్‌ల్లో పోటీ పడగా మెదక్ విజయం సాధించింది. సెమీఫైనల్ బెర్తు ఖాయం చేసుకుంది. * ఖమ్మం-నిజామాబాద్ జట్ల మధ్య పోటీలో నిజామాబాద్, కరీంనగర్-నల్గొండ జట్ల మధ్య జరిగిన పోటీలో నల్గొండ విజయాలు సాధించాయి. రంగారెడ్డి - నల్గొండ జట్ల మధ్య పోటీ టై అయింది.

బహుముఖ ప్రజ్ఞాశాలి రహమాన్ అలీ



మోత్కూరులో సుద్దాల అశోక్‌తేజ చేతుల మీదుగా చింతల పురస్కారం అందుకుంటున్న రహమాన్ అలీ(పాతచిత్రం)

మోత్కూరు, తిరుమలగిరి, న్యూస్‌టుడే: ఒకేవ్యక్తి అనేక రంగాల్లో ప్రతిభ కనబర్చడం కొందరికే సాధ్యం. ఆ కోవకు చెందిన వారు తిరుమలగిరి మండలకేంద్రానికి చెందిన మహ్మద్ రహమాన్ అలీ. క్రీడోపాధ్యాయుడిగా ఈయన చాలాకాలం మోత్కూరులో పనిచేసి, అక్కడే ఉద్యోగ విరమణ పొందారు. రంగస్థల నటుడిగా, దర్శకుడిగా, ప్రయోక్తగా అనేక నాటకాలు, నాటికలు ప్రదర్శించి మన్ననలు అందుకుంటున్నారు. సంపూర్ణ అక్షరాస్యత ఉద్యమంలో భాగంగా ఉమ్మడి నల్గొండ, వరంగల్ జిల్లాల్లో అనేక ప్రదర్శనలిచ్చి ప్రజలను అక్షరాస్యత వైపు మళ్లించారు. మద్యపాన నిషేధ కమిటీ ఆధ్వర్యంలో నాటకాలు, ఉపన్యాసాలతో జనాల్లో చైతన్యం తీసుకొచ్చారు. స్కౌట్ మాస్టర్‌గా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. హైదరాబాద్‌లో జరిగిన ఏషియన్ పసిఫిక్ జాంబూరి, యూనియన్ క్యాంపు, బ్యాడ్జ్ శిక్షణలో పాల్గొని మాజీ ప్రధాన మంత్రి మొరార్జిదేశాయ్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. రచయితగా, చిత్రకారుడిగా అనేక సామాజిక అంశాలపై బొమ్మలు గీసి బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందారు.

నిరక్షరాస్యులను నటులుగా తీర్చిదిద్ది

ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీలో ఆధునిక నటనలో శిక్షణ పొందిన రహమాన్ అలీ చదువురాని స్థానిక గ్రామీణులను నటులుగా తీర్చిదిద్దారు. వారితో కలిసి 'అన్నాచెల్లెలు, కీర్తిశేషులు, విషాదాంతం, పల్లెపడుచు, పూలరంగడు, నీలిదీపాలు' వంటి నాటకాలు, పశ్చాత్తాపం, చీకటి తెరలు, అంతర్వాణి, వెంకన్న కాపురం, ఊబి, కళ్లు, ఛాయ, ఊరుమ్మడి బతుకులు తదితర నాటికలను కడప, హైదరాబాద్ రవీంద్రభారతి, తదితర చోట్ల ప్రదర్శించారు. దొరోరి బంగ్లా, కొడుకు పుట్టిండు నాటికలు దూరదర్శన్‌లో, 'ప్రేమ పక్షులు' నాటకం రేడియోలో ప్రసారమయ్యాయి. రాష్ట్ర, అఖిలభారత స్థాయిలో ప్రదర్శనలు ఇచ్చిన ఆయనకు ఎన్నో పురస్కారాలు లభించాయి. పరుచూరి బ్రదర్స్, సినీ నటుడు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, దాసరి నారాయణరావు, తదితర సినీ ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. 'నటన, ఆటల్లో తర్ఫీదు ఇవ్వడం తనకెంతో ఇష్టమని, అందుకే అనేక మందిని ఆయా రంగాల్లో తీర్చిదిద్దాన'ని రహమాన్ అలీ తెలిపారు.

ధనలక్ష్మి అవతారం.. కరెన్సీ నోట్ల అలంకారం



చౌటుప్పల్‌లో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి ఆదివారం ధనలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. నిర్వాహకులు రూ.45 లక్షల విలువైన కరెన్సీ నోట్లను పోగు చేసి దండలుగా మార్చి అమ్మవారిని, మండపాన్ని అలంకరించారు. హారతి పళ్లెంలో నోట్ల కట్టలను పేర్చారు. ఎటు చూసినా 100, 200, 500 రూపాయల నోట్లు కనిపించేలా తీర్చిదిద్దారు. **- చౌటుప్పల్, న్యూస్‌టుడే**

ఆడదూడలు పుట్టేలా.. కృత్రిమ గర్భధారణ



నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే:

కృత్రిమ గర్భధారణ(ఏఐ)తో ఆడదూడలే పుట్టేలా చేస్తున్న ప్రయోగాలు ఉమ్మడి నల్గొండ జిల్లాలో విజయవంతమయ్యాయి. లింగ నిర్ధారిత వీర్య నాళికలతో పశుగణాభివృద్ధి సంస్థ ఈ ఘనత సాధించింది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికి 58 ఆడదూడలు పుట్టాయి. తక్కువ ఖర్చుతో 90 శాతం కచ్చితత్వంతో అధిక పాల దిగుబడి సామర్థ్యం గల మేలు జాతి ఆడదూడలు పుట్టించి పాడి రైతుల ఆదాయం పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ గోకుల్ మిషన్‌ను తీసుకొచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా డీఎల్‌డీఏ ఆధ్వర్యంలో గత ఏడాదిలో లింగ నిర్ధారిత కృత్రిమ గర్భధారణ కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఈ పథకంలో 2078 పశువులకు కృత్రిమ గర్భధారణ చేశారు. ఈ విధానంలో 90 శాతం ఆడదూడలు పుట్టే అవకాశం ఉంది. ఆడదూడల సంఖ్య పెరిగితే పాల దిగుబడి వృద్ధి చెంది పశుపోషకులకు ఆదాయం సమకూరుతుంది.

మూడేళ్లకే పాల దిగుబడి..

ఆడ దూడ 18 నెలలకే చూడికి వస్తుంది. మూడేళ్లకే దూడకు జన్మనిస్తుంది. దీంతో రైతుకు కేవలం మూడేళ్లకే పాల దిగుబడి ప్రారంభమై ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం కలుగుతుంది. ఈ పథకానికి జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ నోడల్ మానిటరింగ్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. ప్రభుత్వం లింగ నిర్ధారణ వీర్యం కలిగిన స్ట్రాని రైతులకు రాయితీపై అందిస్తోంది. ధర రూ. 675 కాగా రైతు వాటాగా రూ.250 చెల్లించాలి.

ఉమ్మడి జిల్లా వివరాలు..

- ★ ఆడదూడలు పుట్టేలా కృత్రిమ గర్భధారణ (ఏఐ) చేసిన పశువులు: 2078
- ★ ఇప్పటికి చూడిదాల్చినవి: 1183
- ★ ప్రస్తుతం పుట్టిన ఆడదూడలు: 58
- ★ ఏఐతో లభ్యమయ్యే జాతులు: గేదెలు ముర్రా, ఆవుల్లో సాహివాల్, హెచ్.ఎఫ్, జెర్సీ

పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి

–ఎం.రాజశేఖర్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి, నల్గొండ

పశువులకు లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేస్తే మేలు జాతి దూడలు జన్మిస్తున్నాయి. వాటిని బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయాలంటే అధిక వ్యయమవుతుంది. ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన గేదెలు ఇక్కడి వాతావరణానికి సర్దుబాటు కాకపోవడంతో పాల దిగుబడి తగ్గుతోంది. పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించడానికి ఇది అనువైన కాలం. డీఎల్‌డీఏ ద్వారా చేపట్టే ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00



అప్పాలు కాల్చేదెలా..!

భానుపురి, న్యూస్‌టుడే:

వంట నూనెల ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. పండగ సమయంలో సామాన్య కుటుంబాలకు భారంగా మారుతున్నాయి. దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం సుంకం పెంచడంతో ఆయా కంపెనీలు ధరలను గణనీయంగా పెంచేశాయి. పది, పదిహేను రోజుల వ్యవధిలో నూనెల ధరలు కిలోకు రూ.20-రూ.30 వరకు పెరిగాయి.

పెంపు ఇలా..

గత నెల 13న కేంద్రం ప్రభుత్వం వంట నూనెల దిగుమతి సుంకాన్ని 20 శాతం పెంచింది. దీంతో లీటర్ పొద్దుతిరుగుడు రూ.135, పామోలిన్ రూ.125కు చేరింది. గత నెల 13న పోలిస్తే ఒక్కో లీటర్‌పై రూ.20 వరకు పెరిగింది. మరికొద్ది రోజుల్లో మరో రూ.5 వరకు పెరిగే అవకాశముంది. పెంపు విషయంలో పలు కంపెనీలు సంయమనం పాటించగా కొన్ని మాత్రం పెంచేశాయి.

మన నూనెలకు ధరలు

మన దేశంలో ఉత్పత్తయ్యే వేరుసెనగ, సోయాబీన్ తదితర నూనెల ధరలు విదేశీ ఉత్పత్తులతో సమానంగా పెరిగాయి. సెప్టెంబరు 10 వరకు లీటర్ రైస్‌బ్రాన్ నూనె ప్యాకెట్ రిటైల్ ధర రూ.120 వరకు ఉండగా ప్రస్తుతం రూ.135కి పెంచారు. వేరుసెనగ నూనె ధర రూ.150కు నుంచి రూ.155 వరకు పెరిగింది. దిగుమతి సుంకం పరిధిలోకి రాని దేశీయ నూనెల ధరలను సైతం పెంచడంతో సామాన్యులకు భారంగా మారింది.

దీనికి అధికం

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎక్కువగా పొద్దుతిరుగుడు నూనె వినియోగిస్తారు. గృహ, వాణిజ్య అవసరాలకు ప్రతి నెలా 4200 మెట్రిక్ టన్నుల వివిధ రకాల వంట నూనెలు వాడుతున్నట్లు వ్యాపారులు తెలిపారు. అత్యధికంగా పొద్దుతిరుగుడు 2600 మెట్రిక్ టన్నులు, పామోలిన్ 900 ఎంటీలు, వేరుసెనగ, తవుడు, ఇతర నూనెలు 700 ఎంటీలు ఉంటాయి. రోజువారీగా మారుతున్న ధరలను పరిగణనలోకి తీసుకుంటే భారం మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

కోదాడ
•కోదాడ •హుజూర్‌నగర్

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం: సీపీఎం

నడిగూడెం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై సీపీఎం రాజీలేని పోరాటం చేస్తుందని పార్టీ జిల్లాకార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం రామాపురంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం రైతు బంధును వెంటనే విడుదల చేయాలని కోరారు. అనంతరం గ్రామశాఖ కార్యదర్శిగా వై.మోహన్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేరేడుచర్ల: ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు కోరారు. నేరేడుచర్ల పట్టణంలో కె.తిరుపతయ్య అధ్యక్షతన జరిగిన సీపీఎం సమావేశంలో మాట్లాడారు. సైదులు, మీనయ్య, ఏసు పాల్గొన్నారు.

పాలకవీడు గ్రామీణం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలును విస్మరించి, హైడ్రా పేరిట గందరగోళం సృష్టిస్తూ జనం దృష్టి మరల్చే ప్రయత్నం చేస్తుందని సీపీఎం మండల కార్యదర్శి అనంత ప్రకాశ్ విమర్శించారు. గుడుగుంట్లపాలెంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. పార్టీ గ్రామ శాఖ కార్యదర్శిగా వెంకటేశ్వర్లు ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

నాటి జ్ఞాపకాలలో..!

గరిడేపల్లి, న్యూస్‌టుడే: గరిడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులంతా తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాటి చిలిపి చేష్టలు, అల్లరి పనులు గుర్తు చేసుకుంటూ ఆటలు, పాటలతో గడిపారు. తోటి స్నేహితులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని నిర్ణయించారు. నాటి గురువులను సన్మానించారు.


గరిడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రామకృష్ణ సేవలు మరువలేం

గరిడేపల్లి, న్యూస్‌టుడే: అమరవీరుల త్యాగాలతో ఎర్రజెండా ఎరుపెక్కిందని మాజీ శాసనసభ్యుడు పల్లా వెంకటరెడ్డి అన్నారు. కల్మల్‌చెరువులో ఇటీవల మృతి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు దాసరి రామకృష్ణ సంతాప సభలో మాట్లాడారు. రామకృష్ణ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్, మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కల్మల్‌చెరువులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శాంతియాత్ర

కోదాడ పట్టణం: బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ, విజయదశమి ఉత్సవాల్లో భాగంగా మానవాళి శాంతి కోసం పట్టణంలో బతుకమ్మలతో యాత్రను బ్రహ్మకుమారీస్ ఇన్‌ఛార్జి బీకే లక్ష్మీ ప్రారంభించారు. అనంతరం వేషధారణలో ఉన్న విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ కోదాడ ఇన్‌ఛార్జి బీకేలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్ మృతి


షేక్ బాలసైదా

పాలకవీడు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జాన్‌పహాడ్ గ్రామానికి చెందిన షేక్ బాలసైదా(64) ఆదివారం మృతి చెందారు. కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురికాగా ఆసుపత్రిలో కుటుంబసభ్యులు చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా మారడంతో బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురై ఆదివారం తుది శ్వాస విడిచారు. 40 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసిన సీనియర్ నాయకుడు బాలసైదా ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటు అని పలువురు నాయకులు పేర్కొన్నారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మాజీ ఎంపీపీ గోపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్వీ సుబ్బారావు, ఏఎంసీ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బ్యాటరీల చోరీ

మునగాల, న్యూస్‌టుడే: ట్రాక్టర్ బ్యాటరీలు చోరీకి గురైన ఘటన శుక్రవారం అర్ధరాత్రి మండలంలో చోటు చేసుకుంది. బాధితులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కృష్ణానగర్, బరాఖత్‌గూడెం గ్రామాలకు చెందిన రైతులు తమ ఇంటి ముందు ట్రాక్టర్లను నిలిపి ఉంచారు. ఆ ట్రాక్టర్ల నుంచి బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. కృష్ణానగర్‌లో ఆరు, బరాఖత్‌గూడెంలో మూడు బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. బాధిత రైతులు స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ఇసుక లారీ పట్టివేత

చింతలపాలెం, న్యూస్‌టుడే: కోదాడ నుంచి చింతలపాలేనికి అక్రమంగా ఇసుకను తీసుకొస్తున్న లారీని పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై అంతిరెడ్డి ఆదివారం తెలిపారు.

సినిమాలు కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

విష్ణురామ్: దేవర, సత్యం సుందరం, **శ్రీనివాస:** దేవర, **కాన్‌ప్లెక్స్:** దేవర, **రంగా:** శ్వాగ్, **వెంకటేశ్వర:** రామ్‌నగర్ బన్నీ

ఎల్-27 ఎత్తిపోతల కింద ఎండుతున్న పొలాలు

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: నేరేడుచర్ల మండలం మేడారం, బక్కయ్యగూడెం గ్రామాల పరిధిలో ఎల్-27 ఎత్తిపోతల పథకం కింద సాగు చేస్తున్న వరి పొలాలకు నీరు సరిపోక పొలాలు ఎండి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని మోటార్లు సక్రమంగా నడవడక పోవడం వల్లే ఈ పరిస్థితి అని వారు వాపోతున్నారు. సాగర్ కాల్వ గండి వల్ల కొన్ని రోజులపాటు నీటిసరఫరా నిలిచి పోయింది. ఇక్కడ సీజన్ ఆరంభం నుంచే మోటార్ల సమస్య ఉంది. తరచూ మోటార్లు కాలిపోతుండటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం రెండు పంపులే నడుస్తున్నాయని, అన్ని పంపులు నడపాలని రైతులు కోరుతున్నారు. ఎత్తిపోతల ద్వారా పూర్తిస్థాయిలో నీటిసరఫరాకు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.


మేడారంలో ఎండిన వరి

నీరందించేందుకు చర్యలు

రామకిశోర్, నీటిపారుదలశాఖ ఈఈ, కోదాడ

మేడారం, బక్కయ్యగూడెం రైతులకు రెండు మోటార్ల ద్వారా నీటి సరఫరా జరగడం వల్ల ఇబ్బంది జరిగింది. మూడో మోటారు బాగు చేయించి అమర్చారు. దూపహాడ్ వైపు నీరందించే మరో రెండు మోటార్లకు మరమ్మతులు చేయిస్తున్నారు. రెండు రోజుల్లో వాటిని అమర్చి పూర్తిస్థాయిలో నీటిసరఫరా చేస్తారు.

బిల్లులు రాక.. పనులు సాగక

–నేరేడుచర్ల, న్యూస్‌టుడే:


పాతనేరేడుచర్లలో నిలిచిపోయిన వైకుంఠధామం పనులు

వైకుంఠధామాలకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించినప్పటికీ సకాలంలో పనులు పూర్తి చేయక ఇబ్బందులు తప్పడం లేదు. పాత నేరేడుచర్లలో రూ.కోటితో, జాన్‌పహాడ్ మేజర్ పక్కన మరో వైకుంఠధామానికి రూ.64 లక్షలు కేటాయించారు. పాత నేరేడుచర్ల వైకుంఠధామం పనులకు సంబంధించి సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో గుత్తేదారు మధ్యలోనే వదిలేశారు. మరో వైకుంఠధామం పనులు కొంత ఆలస్యంగా మొదలు పెట్టారు. ఆ పనులు సైతం ఇంకా అసంపూర్తిగానే ఉండటంతో వినియోగంలోకి రాలేదు. జాన్‌పహాడ్ మేజర్ పక్కన నిర్మిస్తున్న వైకుంఠధామం పనులు రంగులు వేయడం, విద్యుత్తు పనులు చేయాల్సి ఉందని కమిషనర్ అశోక్‌రెడ్డి తెలిపారు.

★ పాత నేరేడుచర్ల వైకుంఠధామానికి సంబంధించి పనులు 70 శాతం పూర్తయ్యాయని ప్రజారోగ్యశాఖ డీఈ రమాదేవి తెలిపారు. బిల్లులు చెల్లించక పోవడంతో గుత్తేదారు పనులు చేయడం లేదని, ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు.

వరద ఉద్ధృతికి.. ఆనవాళ్లు కోల్పోయి

పాలకవీడు గ్రామీణం, న్యూస్‌టుడే: మీగడంపహాడ్ తండావాసుల సౌకర్యార్థం వాగు పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో వైకుంఠధామం నిర్మించారు. వేములేరు వాగుకు ఇటీవల వచ్చిన వరద దాటికి పక్కనే ఉన్న వైకుంఠధామం కూలిపోయింది. శకలాలు కూడా కన్పించకుండా వరద ఉద్ధృతికి కొట్టుకుపోయింది. ప్రహరీ, శౌచాలయాలు, స్నానపు గదులు, మృతదేహాలను దహనం చేసే ప్లాట్‌ఫామ్ ఆనవాళ్లు లేకుండా వరదలో కొట్టుకుపోయాయి. నేల పూర్తిగా కోతకు గురై, పై నుంచి వరదలో ప్రవహిస్తూ వచ్చిన పెద్ద, పెద్ద బండరాళ్లు అక్కడ పేరుకుపోయాయి. వైకుంఠధామం లేకపోవడంతో మళ్లీ తండా వాసులకు కష్టాలు మొదలయ్యాయి. వ్యవసాయ భూముల్లో పంటలు సాగు చేస్తుండటంతో ఎక్కడా ఖాళీ జాగాలు లేవని, రహదారుల వెంట దహన సంస్కారాలు నిర్వహించాల్సి వస్తుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మీగడంపహాడ్ తండాలో ఆనవాళ్లు కోల్పోయిన వైకుంఠధామం

★ జరిగిన నష్టంపై జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్‌శాఖ ఎస్‌ఈ, రాష్ట్ర ఈఎన్‌సీలకు నివేదికలు అందించామని పంచాయతీరాజ్ శాఖ ఏఈ ప్రదీప్ తెలిపారు. పునర్నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు కాగానే పనులు మొదలుపెడతామని పేర్కొన్నారు.

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

? కోదాడలోని అంబేడ్కర్‌నగర్‌లో రహదారులు గుంతలమయంగా ఉన్నాయి. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే గుంతలు పూడ్చాలి. –సైదాచారి, కోదాడ

✔ రహదారులను పరిశీలించి గుంతలను పూడ్చి వేస్తాం. – రమాదేవి, పుర కమిషనర్, కోదాడ

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 50363 96030 18889

మఠంపల్లి, న్యూస్‌టుడే:

? బక్కమంతులగూడెం ఊర చెరువు కట్టపై వరదలకు కూలిపోయిన విద్యుత్తు స్తంభం ఇప్పటి వరకు మళ్లీ ఏర్పాటు చేయలేదు. –విజయభాస్కర్‌రెడ్డి, బక్కమంతులగూడెం


✔ ఇక్కడ బలహీనంగా ఉన్న చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టాకే విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు చెప్పారు. –హరీశ్‌రెడ్డి, ఏఈ

అతిసార బాధితులకు వైద్య శిబిరం ఏర్పాటు

చింతలపాలెం, న్యూస్‌టుడే: చింతలపాలెంలో అతిసార మళ్లీ ప్రబలింది. వాంతులు, విరేచనాలతో దాదాపు పది మంది అస్వస్థతకు గురయ్యారు. రెండ్రోజుల నుంచి ఈ కేసుల సంఖ్య పెరుగుతుండటంతో మండల వైద్యాధికారులు ప్రభావిత ప్రాంతాన్ని ఆదివారం సందర్శించారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి బాధితులకు చికిత్సలందిస్తున్నారు. ఈ ప్రాంతంలో మంచినీటి ట్యాంకు నుంచి సరఫరా అవుతున్న నీటినే తాగుతున్నామని బాధితులు వైద్యులకు చెబుతున్నారు. పొలం పనులకు వెళ్లేటప్పుడూ ఈ నీరే తీసుకెళ్తామని వారికి వివరించారు. ఈ నేపథ్యంలో కలుషిత నీరు తాగితేనే అతిసార వ్యాధి బారిన పడే అవకాశం ఉందని భావిస్తున్న వైద్యులు మరోమారు ఈ నీటిని పరీక్షలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. బాధితులు పూర్తి స్థాయిలో కోలుకునేంత వరకు శిబిరాన్ని కొనసాగిస్తామని తెలిపారు.


శిబిరంలో బాధితులకు మందులిస్తున్న వైద్యబృందం

సహస్ర వృత్తుల జీవన గాథలే సాహిత్యానికి చిహ్నాలు


కవితను ఆవిష్కరిస్తున్న తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్

మునగాల, న్యూస్‌టుడే: బీసీ అస్తిత్వానికి ఊపిరిలూదుతున్న కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం, సాలెల మగ్గం, ఔసుల కుంపటి సహస్ర వృత్తుల జీవనగాథలే తెలుగు సాహిత్యానికి అసలైన చిహ్నాలని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. మండలంలోని నారాయణగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో బాణాల శ్రీనివాసరావు రచించిన కుంపటి దీర్ఘకవితను గ్రామస్థుల సమక్షంలో ఆదివారం ఆవిష్కరించారు. పుస్తకావిష్కరణ సభలను నగరాల కళావేదికల నుంచి గ్రామాల, పల్లెల ఆవరణలోకి తీసుకు వెళ్లే నూతన సంప్రదాయం రావాలన్నారు. యుగంధర్‌రెడ్డి, వీరభద్రరావు, కోటిరెడ్డి, పాల్గొన్నారు.

రామయ్య మృతి బాధాకరం..

మునగాల గ్రామీణం: మాచర్ల రామయ్య మృతి బాధాకరమని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. రేపాలకు చెందిన గ్రామ వెలుగు నాట్య మండలి సీనియర్ కళాకారుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో దశదిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంరక్షణ చట్టం అమలు చేయాలి


వృద్ధులను సన్మానిస్తున్న రావెళ్ల సీతారామయ్య, రాంబాబు, తదితరులు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: వయోవృద్ధుల సంరక్షణ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని వయోవృద్ధుల సంఘం రాష్ట్ర నాయకుడు రావెళ్ల సీతారామయ్య అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పెన్షనర్ల సంఘ భవనంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు కుటుంబ వ్యవస్థ, విలువలు దిగజారుతుండటం బాధాకరమన్నారు. వయోవృద్ధుల సంక్షేమాన్ని చూసుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. అనంతరం 15 మందిని శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో కోదాడ యూనిట్ అధ్యక్షుడు నర్సయ్య, జిల్లా అధ్యక్షుడు బొల్లు రాంబాబు, విద్యాసాగర్ రావు, శ్రీనివాసరావు, రఘుప్రసాద్, జగన్మోహన్ రావు, భ్రమరాంబ తదితరులున్నారు.

పూజలు.. అన్నదానాలు


నేరేడుచర్ల శివాలయంలో లలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: పట్టణంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇంద్రకీలాద్రి తరహాలో అమ్మవారి అలంకరణ జరుపుతున్నారు. ఉత్సవాలలో ఆదివారం అమ్మవారు లలితాత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విజయదుర్గ ఆలయం, శివాలయం, నర్సయ్యగూడెం, శివాజీనగర్‌లలో జరుగుతున్న ఉత్సవాలలో ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

మునగాల: మండల కేంద్రంలోని కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో అమ్మవారి శరన్నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. నాలుగో రోజు ప్రత్యేక అలంకరణలో అమ్మవారు ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు కందాల ప్రశాంతాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని హోమాల్లో పాల్గొన్నారు.


మేళ్లచెరువులో..

హుజూర్‌నగర్ గ్రామీణం: పట్టణంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజ, విశేషహారతులు, అన్నమయ్య భజన మండలి భక్తులతో భజన సంకీర్తనలు చేపట్టారు. రంగభట్టాచార్యులు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.

✦ హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమార్చనలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

చిలుకూరు: నారాయణపురం(పాలెఅన్నారం)లో అన్నదాన కార్యక్రమాన్ని తెలంగాణ తెదేపా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సైదేశ్వరరావు ప్రారంభించారు.


నడిగూడెం సాయినగర్‌లో..


హుజూర్‌నగర్: కుంకుమార్చనలో మహిళలు


నారాయణపురంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సైదేశ్వరరావు


చౌటపల్లిలో నీటి వాడకం కోసం ఇప్పటికీ వినియోగిస్తున్న రాతి గాబు

అలనాటి జ్ఞాపకం దశాబ్దాలుగా పదిలం

పాత తరం నాటి పరికరాలను వినియోగిస్తూ వాటి విలువను నేటి యువతకూ తెలియజేయాలన్నది ఆ రైతు సంకల్పం. ఆరు దశాబ్దాల క్రితం ప్రత్యేకంగా నీటి అవసరాల కోసం ఎంతో ఇష్టంగా తయారు చేయించుకున్న రాతి గాబును ఆయన ఇప్పటికీ నిత్యం వాడుకుంటున్నారు. ట్యాంకుల ద్వారా కుళాయి నీటిని ఉపయోగించుకునే ఈ రోజుల్లో ఎక్కువ స్థలాన్ని ఆక్రమించే ఇంత పెద్ద గాబు ఎందుకని పిల్లలు వారించినా రోజూ నీటిని నింపి దాన్ని పదిలంగా చూసుకుంటున్నారు. మఠంపల్లి మండలం చౌటపల్లికి చెందిన రైతు శాగం రెడ్డి జగన్మోహన్‌రెడ్డి 1971లో ఆరున్నర అడుగుల పొడవు, మూడడుగుల వెడల్పు, రెండున్నర అడుగుల లోతుతో ఓ పెద్ద రాతి గాబును తయారు చేయించారు. సుమారు 440 లీటర్ల సామర్థ్యం ఉన్న ఈ గాబును ఒకే రాతిని ఉలులతో తొలిచి వెంకట్రాంపురానికి చెందిన జింకలోళ్లుగా వ్యవహరించే భార్యాభర్తలు తయారు చేశారని జగన్మోహన్‌రెడ్డి చెప్పారు. అప్పట్లో పశువులు ఎక్కువగా ఉండేవని జీతగాళ్లు బావుల నుంచి నీటిని తెచ్చి దీన్ని నింపేవారని పేర్కొన్నారు.


శాగంరెడ్డి జగన్మోహన్‌రెడ్డి

- మఠంపల్లి, న్యూస్‌టుడే

గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం

నడిగూడెం, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలనలో ప్రజలు కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను డంపింగ్ యార్డులకు తరలించాలని ఆదేశాలున్నా.. అమలు కావడం లేదు. వీధుల్లోనే చెత్త, చెదారం వేస్తున్నారు. మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందని ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో ఏర్పాలు చేసిన సెగ్రిగేషన్ షెడ్లు ఉత్స విగ్రహాలుగా దర్శనమిస్తున్నాయి. మండల పరిధిలోని ఐదుగురు పంచాయతీ కార్యదర్శులు సెలవులపై వెళ్లడంతో ఇన్‌ఛార్జిలతో కాలం వెల్లదీస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామాలను పరిశీలించి పారిశుద్ధ్యం మెరుగు పర్చేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీవో విజయకుమారి తెలిపారు.


రామాపురంలో పరిస్థితి ఇలా..

సంక్షిప్త సమాచారం

ఇంటర్న్‌షిప్.. నడిగూడెం: కరివిరాల ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా రిటైల్ మార్కెటింగ్‌పై ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నారు. విద్యార్థులు పది రోజుల పాటు మార్కెటింగ్ వ్యవస్థపై ప్రయోగపూర్వక అవగాహన పెంపొందించుకోవాలని ప్రిన్సిపల్ సాయిఈశ్వరీ తెలిపారు.

డిమాండ్.. నేరేడుచర్ల: సాటి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖను మంత్రిమండలి నుంచి తొలగించాలని భారాస నియోజకవర్గ అధికార ప్రతినిధి నర్సింహారావు డిమాండ్ చేశారు. కేటీఆర్‌పై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు.

ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలి.. మునగాల: రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గానికి ఓ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటుచేసి, నిరుద్యోగులకు ఉపకార వేతనం, ఉచిత భోజనంతో కూడిన శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు.

గడ్డి మందు పిచికారీతో ఎండిన పొలం.. మునగాల: మునగాల మండల కేంద్రానికి చెందిన ఓ రైతు నాలుగు ఎకరాల వరి సాగు చేశారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు పైరు ఏపుగా పెరిగింది. రైతు నాటు వేసే సమయంలో గడ్డి మందు తీసుకొచ్చి పిచికారీ చేశాడు. మిగిలిన దాన్ని ఇంట్లో నిల్వ ఉంచాడు. ఇటీవల పొలంలో సస్య రక్షణ చర్యల్లో భాగంగా పురుగు మందులు తీసుకొచ్చి, ఇంట్లో ఉన్న గడ్డిమందు వద్ద పెట్టాడు. రెండు మందులు ఒకే రకంగా ఉండటంతో పొరపాటున గడ్డిమందును పిచికారీ చేశాడు. దీనితో పొలం పూర్తిగా ఎండిపోయింది.

వైభవంగా బతుకమ్మ వేడుకలు


కాలిఫోర్నియాలోని సాన్‌రామన్‌లో బతుకమ్మ ఆడుతున్న నేరేడుచర్లవాసులు

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: వేపలసింగారం గ్రామ పంచాయతీ పరిధిలోని మిట్టగూడెం గ్రామంలో బతుకమ్మ వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహిళలు, చిన్నారులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అలంకరించారు.

చిలుకూరు: మండల కేంద్రంలోని చెన్నకేశవ దేవాలయ ఆవరణలో మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

నేరేడుచర్ల: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమైన బతుకమ్మ వేడుకలు ఎల్లలు దాటాయి. తెలుగు వారు ఏ దేశంలో ఉంటే ఆ దేశంలో బతుకమ్మ సంబరాలు జరుగుతున్నాయి. అమెరికాలో కాలిఫోర్నియాలోని సాన్‌రామన్ ఉన్న నేరేడుచర్ల మహిళలు బతుకమ్మ వేడుకలలో ఆడిపాడారు. వేడుకల్లో కొణతం విజయలక్ష్మి, దొంతిరెడ్డి కవిత, అల్లుబెల్లి నిహారిక, కన్మతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కోదాడలో నృత్యం చేస్తున్న మహిళలు


చిలుకూరులోని చెన్నకేశవ దేవాలయ ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

కంకర వేశారు.. తారు మరిచారు

ఆకుపాముల నుంచి తెల్లబల్లి మీదుగా రత్నవరం వరకు ఉన్న రోడ్లు భవనాల శాఖ రహదారి నిర్మాణ పనుల్లో జాప్యంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. కంకర పరిచి నెలలు దాటినా తారు వేయకపోవడంతో కంకర తేలిన రహదారిపై ప్రయాణం ఇబ్బందిగా మారిందని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుని పనులు చేపట్టాలని కోరుతున్నారు. త్వరలో బీటీ పనులు చేపడతామని ఆర్ అండ్‌బీ జేఈ సత్యనారాయణ తెలిపారు.

– నడిగూడెం, న్యూస్‌టుడే



సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

పాఠశాల ప్రారంభానికి తరలిరావాలి

తిరుమలగిరి, న్యూస్‌టుడే: నియోజకవర్గానికి మంజూరైన యంగ్‌ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలను ఈనెల 11న తొండలో ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలుగోజు నరేశ్ తెలిపారు. ఆదివారం స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ.. పాఠశాల మంజూరుకు కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు పేరాల వీరేశ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేడ్కర్, మాజీ ఎంపీటీసీ దరావత్ జుమ్మిలాల్ పాల్గొన్నారు.

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:
? సూర్యాపేటలోని జాతీయ రహదారి నుంచి కొత్త మార్కెట్‌కు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. – శ్రీను, సూర్యాపేట
✔ గుంతలు పూడ్చి ఇబ్బందులు లేకుండా చూస్తాం. – [illegible], సూర్యాపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
సూర్యాపేట: 9154395978
తుంగతుర్తి: 80085 74450

భానుపురి, న్యూస్‌టుడే:
? సూర్యాపేటలోని స్నేహనగర్ కాలనీ రోడ్డు నం.5లో ఇళ్ల మధ్యన మురుగు నీరు నిలిచింది. పచ్చగా మారడంతో దుర్వాసనతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. – వాహిద్, స్నేహనగర్
✔ స్థల యజమానితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం. – సారగండ్ల శ్రీనివాస్, పుర శానిటరీ ఇన్‌స్పెక్టర్, సూర్యాపేట

పంటపొలాల్లో.. సాగుబడులు


ఆత్మకూర్(ఎస్): తుమ్మలపెన్‌పహాడ్‌లో రైతులు, అధికారులతో కలిసి పత్తి చేనును సందర్శించిన వ్యవసాయ విద్యార్థులు

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: వారంతా నగరాల్లో వ్యవసాయ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు. పుస్తకాలు చదివితే సరిపోదు.. క్షేత్రానుభవం కావాలని పల్లెబాట పట్టారు. వివిధ రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్లో బీఎస్సీ వ్యవసాయ కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు.. జిల్లాలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం నిర్వహిస్తున్న గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమం కోసం ఏటా మూడు, నాలుగు నెలల పాటు పల్లెల్లోని సాగు క్షేత్రాల్లో పర్యటిస్తున్నారు. ఈ ఏడాది ఆంధ్ర లయోలా వ్యవసాయ కళాశాల(విజయవాడ) నుంచి 18 మంది, సికింద్రాబాద్ లయోలా అకాడమీ నుంచి 49, ఓరియంటల్ కళాశాల నుంచి 6, హైదరాబాద్ సరయూ విశ్వవిద్యాలయం నుంచి 16, మాండ్యూర్ యూనివర్సిటీ నుంచి 11, ఐటీఎం యూనివర్సిటీ నుంచి 9 మంది విద్యార్థులు క్షేత్ర పర్యటన నిమిత్తం జిల్లాకు వచ్చారు.

తెలుసుకుంటూ.. తెలుపుతూ

ఆత్మకూర్(ఎస్) మండలంలో కేవీకే దత్తత తీసుకున్న ఆత్మకూర్(ఎస్), నెమ్మికల్, తుమ్మలపెన్‌పహాడ్, గట్టికల్ గ్రామాల్లో ఒక్కో విద్యార్థి ఒక్కో రైతును ఎంపిక చేసుకొని గ్రామీణుల సాగు విధానం, పాటిస్తున్న పద్ధతులను తెలుసుకుంటూ అనుభవం గడిస్తున్నారు. ప్రతి 15 రోజులకోసారి గడ్డిపల్లి కేవీకేను సందర్శించి అక్కడ శాస్త్రవేత్తలు చెప్పిన యాజమాన్య పద్ధతులను క్షేత్రస్థాయిలో రైతులకు వివరిస్తున్నారు. శాస్త్రవేత్తలతో కలిసి రైతు క్షేత్రాలను సందర్శిస్తున్నారు. వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలపైన, పంట తెగుళ్లు, ఆశించే పురుగులు, నివారణ చర్యలు, నూతన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

అధిక ఎరువుల వాడకాన్ని గుర్తించాం



– దెందులూరి సాయి భానుతేజ, మేడ్చల్(లయోలా అకాడమీ, సికింద్రాబాద్)

పుస్తకంలో చదువుకున్న దానికంటే ఎక్కువగా ఈ ప్రాంతంలో ఎరువులను ఉపయోగిస్తున్నారు. దీంతో తాత్కాలికంగా దిగుబడి పెరగొచ్చు. భవిష్యత్తులో మాత్రం భూసారం దెబ్బతిని దిగుబడి తగ్గిపోతుంది. ఈ సమస్యను రైతులకు వివరించాం. వారు పాటిస్తున్న కొన్ని పద్ధతులను నేర్చుకున్నాం.

సేంద్రియ ఎరువు తయారీలో శిక్షణ



– [illegible], నిజామాబాద్ (లయోలా అకాడమీ, సికింద్రాబాద్)

సేంద్రియ ఎరువుల ప్రయోజనాలపై అవగాహన కల్పించాం. ఘనామృతం, జీవామృతం తయారీని రైతులతో చేయించాం. వరిలో అక్కడక్కడ అగ్గితెగులు, పత్తిలో చీడపీడల సమస్యలను గుర్తించి నివారణ చర్యలను శాస్త్రవేత్తల సలహాలతో అందించాం.

రైతులతో మమేకమవుతూ..



– ఆకుల నరేష్, ప్రోగ్రాం అసిస్టెంట్, రావెప్ కోఆర్డినేటర్, గడ్డిపల్లి

తరగతిలో నాలుగేళ్లపాటు వ్యవసాయ పాఠాలు చదివిన విద్యార్థులు ప్రస్తుతం క్షేత్రస్థాయిలో నేర్చుకుంటున్నారు. రైతులతో కలిసిపోయి వారి అనుభవాలను తమకు ఉపయోగపడేలా అన్వయించుకుంటున్నారు. పొలాలు దున్నే దశ నుంచి పంట చేతికొచ్చే వరకు ప్రత్యక్షంగా గమనిస్తున్నారు.

సాగు అనుభవం వచ్చింది



– ఎం.చేతన్, మహబూబాబాద్
(ఆంధ్ర లయోలా కళాశాల, విజయవాడ)

కళాశాలలో కేవలం పుస్తకాలు మాత్రమే చదివాం. క్షేత్ర పరిజ్ఞానం లేదు. ఈ మూడు నెలల కాలంలో తరగతి గదిలో చదివింది ఇక్కడ పొలంలో ప్రత్యక్షంగా నేర్చుకున్నాం. శాస్త్రవేత్తల ద్వారా నేర్చుకున్న కొత్త విషయాలపై రైతులకు అవగాహన కల్పించాం. ఎంఎస్సీతోపాటు పీహెచ్‌డీ పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నా.

అనుబంధ రంగాలపై అవగాహన



– ఎ.భరత్‌కుమార్‌రెడ్డి, నంద్యాల
(ఆంధ్ర లయోలా కళాశాల, విజయవాడ)

కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా గట్టికల్ రైతులతో మమేకమయ్యాం. అధిక పంట దిగుబడులపైన శాస్త్రవేత్తల సూచనలతో అవగాహన కల్పించాం. వ్యవసాయంతో ముడిపడి ఉన్న అనుబంధ రంగాలపై విస్తృతంగా ప్రచారం చేశాం.

సౌర యాగం.. భక్తి పరవశం

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: తిమ్మాపురంలోని శ్రీఅఖండ జ్యోతి స్వరూప శ్రీసూర్యనారాయణస్వామి ద్వాదశ


శ్రీ సూర్య క్షేత్రంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆదిత్యాది క్షేత్రంలో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మధ్యాహ్నం సమయంలో సౌర యాగం నిర్వహించారు. సౌర ఆరాధకుడు జనార్దనస్వామి, ఘనపురం నరేష్, అర్చకులు పాల్గొన్నారు.



కోతకు గురై.. ప్రమాదాలకు నెలవై

మండలంలోని బక్క హేమ్లాతండా గ్రామపంచాయతీ కార్యాలయం పక్కన బోటికిందితండాకు వెళ్లే ప్రధాన సీసీ రోడ్డువెంట నిర్మించిన మురికికాలువ రెండేళ్ల కిందట వరదతాకిడికి కొట్టుకుపోయింది. కాలువకు రెండుపక్కల దిమ్మెలు కూలిపోయి ఐదు అడుగుల లోతు కోతకు గురైంది. రోడ్డు వెంట వెళ్లే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో ద్విచక్రవాహనం ప్రమాదంలో చిక్కి గాయాలతో భయటపడ్డట్లు గిరిజనులు తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే కూలిపోయిన కాలువను నిర్మించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. 'గ్రామ పంచాయతీలో నిధుల కొరత ఏర్పడింది. ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లి కాలువలకు నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని కార్యదర్శి గడ్డమీది శ్రీనాథ్ 'న్యూస్‌టుడే'కు వివరణ ఇచ్చారు. – న్యూస్‌టుడే, నూతనకల్

గురువులను సన్మానించి.. జ్ఞాపకాలు గుర్తుచేసుకొని


పెన్‌పహాడ్: ఆత్మీయ సమ్మేళనంలో 1997-98 బ్యాచ్ విద్యార్థులు

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1997-98లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఆనాటి గురువులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. పాఠశాలలోని తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఆటా పాటలతో సందడి చేశారు. 26 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులందరూ ఒకే వేదికపై కలుసుకొని ఆనందం వ్యక్తం చేశారు. గురువులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, లక్ష్మీకాంతారావు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల గ్రామీణం: గోరెంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 2000-01లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమ గురువులను శాలువాలతో సన్మానించి, చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మహేష్, కిరణ్, శ్రీను, సతీష్, స్వరూప, సుష్మిత, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


గోరెంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో..

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2001-02లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం సత్యాగార్డెన్స్‌లో సమ్మేళనాన్ని నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, అరుణ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, సిబ్బంది బాబు తదితరులు పాల్గొన్నారు.


పెన్‌పహాడ్: గురువులతో 2001-02 బ్యాచ్ విద్యార్థులు

ఇచ్చిన హామీలు అమలుపర్చాలి

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరి రావు కోరారు. పర్సాయపల్లి గ్రామంలో ఆదివారం సీపీఎం గ్రామ మహాసభ నిర్వహించారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు పర్చడం లేదని ఆరోపించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు చెరుకు ఏకలక్ష్మీ, మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, అరిగె వీరస్వామి, శిగ వెంకన్న, అబ్బులు, సైదులు, విజయ్, వెంకన్న పాల్గొన్నారు.



పర్సాయపల్లిలో మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యాదగిరిరావు

ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతరకు పేట వాసి

సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఏపీలోని తాడేపల్లి గూడెంలో ఈ నెల 19, 20న నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతర కార్యక్రమానికి సూర్యాపేటకు చెందిన శ్రీ కళావేదిక తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు కవి, రచయిత సామాజిక కార్యకర్త డా.పోతుగంటి వీరాచారిని ఆహ్వానించినట్లు ఆయన ఆదివారం తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలు కలిగి 28 ప్రపంచ రికార్డులు సాధించిన సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితి కళా జాతరకు ఆహ్వానం అందడం సంతోషంగా ఉందని చెప్పారు.

కార్యవర్గం ఎన్నిక

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండల ఫర్టిలైజర్, సీడ్స్, ఫెస్టిసైడ్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని అర్వపల్లిలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా నల్ల రామచంద్రయ్య, అధ్యక్షుడిగా బోయపల్లి వీరసోములు, ప్రధాన కార్యదర్శిగా పాలబిందెల జాని, కోశాధికారిగా ఖమ్మంపాటి నరేష్‌లు ఎన్నికయ్యారు.


వీరసోములు

రహదారికి మరమ్మతులు చేపట్టాలి: సీపీఎం

నాగారం, న్యూస్‌టుడే: తిరుమలగిరి మండలం గుండెపురి నుంచి పస్తాల మీదుగా తుంగతుర్తి మండలంలోని కాశితండా వరకు ఉన్న రహదారికి మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్ డిమాండ్ చేశారు. నాగారంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సుమారు 12 కిలోమీటర్ల దూరం గల రహదారి కంకర తేలి పూర్తిగా దెబ్బతిందన్నారు. గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో ఎన్నో సార్లు ప్రమాదాలు జరిగినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదన్నారు. ఈ రోడ్డుపై పస్తాల శివారులో ఉన్న కల్వర్టు వద్ద వంతెనను నిర్మించాలని కోరారు. నాయకులు గుడిపుడి వెంకటేశ్వర్లు, మహేందర్, భిక్షం, సత్తయ్య, అంజయ్య, పద్మ, స్వరూప పాల్గొన్నారు.

ఆకుకూరల కొరత..!

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట కూరగాయల మార్కెట్‌లో ఆకుకూరల కొరత నెలకొంది. నెలరోజులుగా దొరక్కా వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి కొరత ఏర్పడింది. పట్టణ ప్రజలకు కావాల్సిన రకాలు దొరకకపోవడంతో మార్కెట్‌కు వచ్చి వెనుదిరుగుతున్నారు.

కళ తప్పిన మార్కెట్



సూర్యాపేటలో కూరగాయల మార్కెట్‌కు స్థానికంగా రైతులు పండించిన కూరగాయలే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటారు. వీటిలో ఆకుకూరలు ముఖ్యమైనవి. ప్రస్తుతం సరిపడా రావటం లేదు. మార్కెట్‌లో పాలకూర, మెంతి, గోంగూర మాత్రమే లభిస్తున్నాయి. ఇటీవల కొంత గంగవాయిలు కూర కనిపించినా మిగతా రకాలైన తోట, చుక్క కూరలు కనిపించటం లేదు. ఆకు కూరలను ఎక్కువగా పప్పు, ఇతర వాటిల్లో వాడుతుంటారు. వీటిలో పోషకాలు ఎక్కువగా ఉండటంతో ప్రతి ఒక్కరూ మార్కెట్‌కు వచ్చినప్పుడు వీటిని తీసుకెళ్తారు. ఎక్కువగా ఇష్టపడే గంగవాయిలు, చుక్క కూరను కొనుగోలు చేస్తున్నారు. వీటి కొరత మార్కెట్‌లో అధికంగా ఉంది. గతంలో ఆకుకూరలతో కళకళలాడే మార్కెట్ కొన్ని రకాలు లేకపోవటంతో కళతప్పింది. కూరగాయల ధరలు కూడా కిలో రూ.100కు పైగా ఉన్నాయి.

వరదలే కారణం..

ఖమ్మం, విజయవాడ నుంచి స్థానిక మార్కెట్‌కు ఆకు కూరలు దిగుమతి చేసుకుంటారు. గత నెలలో భారీ వర్షాలు కురిసి వరదలు పారాయి. దీంతో పంటలు నీటమునిగి చేతికిరాకపోవటంతో కొరత ఏర్పడింది. ప్రస్తుతం స్థానికంగా సాగు చేసిన రైతులు అడపాదడపా తీసుకొస్తున్నారు. దీంతో వినియోగదారులు వారికి కావాల్సిన రకం దొరక్కా ఇబ్బందులు పడుతున్నారు.

పూల గుమ్మడి.. బతుకమ్మ సందడి

సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే: బతుకమ్మ ఉత్సవాలు పేటలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజు శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున బతుకమ్మలను తీసుకువచ్చి ఆలయ ప్రాంగణంలో ఉంచారు. అనంతరం బతుకమ్మకు పూజలు చేసి కోలాటాలతో ఆడి పాడారు. అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు బతుకమ్మను అందంగా అలంకరించిన భక్తులకు బహుమతులను అందజేశారు.


సూర్యాపేట కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో బతుకమ్మకు పూజలు చేస్తున్న మహిళలు


వేదాంత భజన మందిరం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఉచిత వైద్య శిబిరం

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని రజిని ఆసుపత్రి ఆధ్వర్యంలో జాజిరెడ్డిగూడెం గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, స్త్రీలకు సంబంధించిన సమస్యలు, అన్ని రకాల సాధారణ వ్యాధులు ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సోమయ్య, సత్తయ్య, సోమయ్య, కృష్ణమూర్తి, డాక్టర్లు రజిని కుమారి, రఘు, జాగృతి, రేష్మ పాల్గొన్నారు.

నేటి నుంచి మండలస్థాయి క్రీడోత్సవాలు

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జాజిరెడ్డిగూడెం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ నెల7 నుంచి 9 వరకు మండలస్థాయి కబడ్డీ క్రీడోత్సవాలు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.12016, ద్వితీయ 10,016, తృతీయ 8016, నాల్గో రూ.6016 ఉంటుందని చెప్పారు.

అక్రమంగా తరలిస్తున్న 50 గోవుల స్వాధీనం

గంపలగూడెం, న్యూస్‌టుడే: కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గంలోని హనుమాన్ జంక్షన్ నుంచి హైదరాబాద్‌కు లారీలో అక్రమంగా తరలిస్తున్న 50 గోవులను ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం గంపలగూడెం పోలీసులు శనివారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఎస్.శ్రీను తెలిపిన వివరాల మేరకు మండలంలోని పెనుగొలను వద్ద అర్ధరాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా లారీలో ఆవులను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే లారీని స్వాధీనం చేసుకొని ఆవులను నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలోని గోశాలలో ఉంచామని పేర్కొన్నారు. తెలంగాణలోని సూర్యాపేట జిల్లా ఆత్మకూరు మండలం నర్సింగ్ తండాకు చెందిన డ్రైవర్ బాణావత్ రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


ఎన్టీఆర్‌జిల్లా నెమలి వేణుగోపాలస్వామి ఆలయ కోనేరు వద్ద సేద తీరుతున్న ఆవులు

లలితాదేవి.. నమోస్తుతే


తిరుమలగిరిలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, తదితరులు

మద్దిరాల, న్యూస్‌టుడే: దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజు ఆదివారం అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండల వ్యాప్తంగా ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తిరుమలగిరి: తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన పలు మండపాల్లో అమ్మవారు ఆదివారం శ్రీలలితా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భారాస మండల అధ్యక్షుడు సంకేపల్లి రఘునందన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీశ్‌కుమార్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు దావుల వీరప్రసాద్, తెడ్డు భాస్కర్, యాకూబ్‌నాయక్, దూపటి రవి, రాంమూర్తి, చంద్రమౌళి, శ్రీధర్ పాల్గొన్నారు.

నూతనకల్: నూతనకల్, యడవెల్లి, తాళ్లసింగారం, వెంకేపల్లి, చిల్పకుంట్ల గ్రామాల్లో దుర్గమ్మను శ్రీలలితా త్రిపుర సుందరి దేవిగా అలంకరించి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహక కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


నూతనకల్: తాళ్లసింగారంలో ప్రత్యేక పూజలు


మద్దిరాలలో.. అమ్మవారు

ఘనంగా అన్నదానం

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: మండలంలోని అనాజీపురం గ్రామపంచాయతీ సమీపంలో దుర్గామాత కమిటీ నెలకొల్పిన మండపం వద్ద ఎన్.సాంబశివారెడ్డి, నిరంజన్‌రెడ్డి సోదరుల ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం చేశారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.


అనాజీపురంలో దుర్గామాత వద్ద అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: కూలీ కోసం వెళ్లిన ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన నూతనకల్ మండలంలోని పెదనెమిలలో జరిగింది. గ్రామానికి చెందిన గడ్డం రామనర్సమ్మ(48) ఆదివారం అదే గ్రామానికి చెందిన కనకం రాజు వ్యవసాయ పొలంలో పనుల చేసేందుకు వెళ్లారు. రామనర్సమ్మ కిందపడిపోయిందని(మూర్ఛ, పురుగు మందు తాగిందని, పలు కారణాలతో) వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలని, ఆటో తీసుకు రమ్మని రాజు.. కనకం గణేశ్‌కు చెప్పాడు. ఇద్దరు స్థానిక ఆసుపత్రికి తరలించారు. రాజే హత్య చేసి సాధారణ మృతిగా చిత్రీకరించేందుకు ప్రయత్నించాడని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. నిందుతుల్ని అరెస్ట్ చేసే వరకు శవపంచనామాకు అనుమతించమని బాధిత కుటుంబ సభ్యులు భీష్మించుకు కూర్చున్నారు. మృతురాలి తమ్ముడు వరిగడ్డి సాగర్ ఫిర్యాదు మేరకు కనకం రాజు అతనికి సహకరించి కనకం గణేశ్‌లపై తుంగతుర్తి సీఐ శ్రీనివాస్ నాయక్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేంద్రనాథ్ తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

తుంగతుర్తి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని అన్నారంలో శనివారం రాత్రి జరిగింది. ఎస్సై ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గానుగుబండకు చెందిన గుండగాని మల్లయ్య స్కూటీపై తన కుమార్తె ఊరైన అన్నారానికి వెళ్తున్నాడు. గ్రామ సమీపంలో అన్నారం నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇరుగు ఏసురత్నం, మరో వ్యక్తి తుంగతుర్తికి వస్తున్నారు. ఈ క్రమంలో ముందు వెళ్తున్న ఆటోను దాటబోయి ఎదురుగా వస్తున్న మల్లయ్యను బలంగా ఢీ కొట్టారు. రోడ్డుపై పడటంతో మల్లయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషయంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కుటుంబీకులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అతిసార బాధితులకు వైద్య శిబిరం ఏర్పాటు

చింతలపాలెం, న్యూస్‌టుడే: చింతలపాలెంలో అతిసార మళ్లీ ప్రబలింది. వాంతులు, విరేచనాలతో దాదాపు పది మంది అస్వస్థతకు గురయ్యారు. రెండ్రోజుల నుంచి ఈ కేసుల సంఖ్య పెరుగుతుండటంతో మండల వైద్యాధికారులు ప్రభావిత ప్రాంతాన్ని ఆదివారం సందర్శించారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి బాధితులకు చికిత్సలందిస్తున్నారు. ఈ నేపథ్యంలో కలుషిత నీరు తాగితేనే అతిసార వ్యాధి బారిన పడే అవకాశం ఉందని భావిస్తున్న వైద్యులు మరోమారు ఈ నీటిని పరీక్షలకు పంపనున్నట్టు పేర్కొన్నారు. బాధితులు పూర్తి స్థాయిలో కోలుకునేంత వరకు శిబిరాన్ని కొనసాగిస్తామని తెలిపారు.